న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖమ్
న మంత్రో న తీర్థో న వేద న యజ్ఞమ్
అహం భోజనైవ న భోజ్యమ్ న భోక్తా
సచ్చిదానంద రూపం సత్యం శివం సుందరమ్.

నేను పుణ్యము కాదు. నేను సౌఖ్యము కాదు దుఃఖము కాదు. నేను మంత్రము కాదు. తీర్థము కాదు. నేను భోక్తను కాదు. కర్తను కాదు. నేను సచ్చిదానంద స్వరూపమైన సత్యం శివం సుందరము.

ఈ మంత్రము ప్రతి వ్యక్తికి కూడను సంబంధించినది. ప్రపంచములో మానవుడు సుఖాభిలాషి. ఆనంద పిపాసి. ఈ సుఖానంద నిమిత్తమై మానవుడు అహోరాత్రములు అనేక శ్రమలు పడి యీ సుఖానందమును సంపాయించుకొనుటకై కృషి చేస్తున్నాడు. అన్నిరంగముల యందూ మానవుడు ఆశించునది రెండు. ఒకటి సుఖప్రాప్తి రెండవది దుఃఖనివృత్తి. మానవుడు సుఖాన్ని కోరటంలో వున్న అంతరార్థము యేమిటి? మానవుడు నిరంతరము ఆనందమును ఆశించుటలో అంతరార్థము ఏమిటి? ఇది కేవలము ఆధ్యాత్మికమునందే కాక వైజ్ఞానికము నందు కూడను దీనికి అనేక ఆధారములు వుంటున్నవి. మానవుని యొక్క స్వభావము స్వరూపము ఆనందమే. అతను సుఖస్వరూపుడు. తన స్వభావమైన ఆనందమును సుఖమును ఆశించుటకు అతనికి అధికారము వున్నది. అతని స్వరూపమే అది. చక్కెర సహజముగా తీపిగా వుంటుంది. యీ తీపి చక్కెర స్వభావము. చక్కెర తన స్వభావమైన తీపి కోల్పోయినప్పుడు అది చక్కెరే కాదు. విచ్చిన గులాబి పుష్పము పరిమళమును అందిస్తుంది. ఆనందమును అందిస్తుంది. ఈ గులాబి పుష్పమునకు యిది స్వభావము. అదేవిధముగనే మానవుడు సుఖమును ఆనందమును కోరుట లోపల యిది వారి స్వభావమే కనుక వారు కోరుటలో అధికారము వున్నది. మానవుని యొక్క స్వభావమైన సుఖానందము లేకోల్పోయిన వాడు మానవుడే కాదు.

కనుక మానవుడు యీ అంతరార్థమును గుర్తించి తాను సుఖము కోరుట లోపల వుండిన రహస్యాన్ని తాను కూడను అర్థం చేసుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. సహజము

నకు విరుద్ధమైన స్థితి యందు అది మనకు విచిత్రముగను వికారముగను రూపొందుతుంది. మనము మార్గములో నడుస్తున్న సమయములో అదే మార్గమునందు యేదో ఒక వ్యక్తి చాలా దుఃఖిస్తూ వుంటాడు. కాని అటూయిటూ పోయే మానవుడు నిలిచి అతని దుఃఖమునకు కారణమేమని ప్రశ్నిస్తాడు. ఈ విధముగా ప్రతి వ్యక్తి కూడను ఆదుఃఖించే వ్యక్తిని ప్రశ్నించటములో వున్న అంతరార్థము ఏమిటి? మానవునికి దుఃఖము స్వభావము కాదే. స్వభావము కాని దుఃఖమును అనుభవిస్తున్నాడు. దీనికి కారణము యేమిటని తెలుసుకోటమే ప్రజలయొక్క అభిలాష. అతని స్వభావము కాని దానిని అనుభవిస్తున్నది చూచిన ప్రతివ్యక్తి కూడను ఆశ్చర్యముగా ప్రశ్నిస్తాడు. అదే బజారునందు మరొక వ్యక్తి ఆనందముగా నవ్వుతూ వుంటాడు. అతను చాలా ప్రసన్నుడై వుంటాడు. అతనిని చూచి ఎవ్వరూ కూడను ఎందుకు నీవు ఏడ్వటం లేదని ప్రశ్నించరే. ఇతను ఆనందము ప్రసన్నత యితని యొక్క స్వభావము. ఆ స్వభావమునకు ఎట్టి ఆశ్చర్యము వుండదు. అస్వభావమునకే ఆశ్చర్యము. కనుక ఆనందము సుఖము మానవుని యొక్క స్వభావమని మానవుడు గుర్తించలేక పోతున్నాడు.

ఈ ఆనంద సుఖములు అందుకొనే నిమిత్తమై యీ దేహ యింద్రియ మనో బుద్ధులు ఏర్పడినాయి. ఐతే దురదృష్టవశాత్తు యీ శరీర యింద్రియ మనో బుద్ధులలో దోషములు చేరిపోవటముచే తన యొక్క స్వభావము స్వరూపమును మరచిపోతున్నాడు. మానవుడు విచారములో మునుగుతున్నాడు. దేహమును రాగద్వేషములనే మాలిన్యము చేత కప్పబడింది. ఇంద్రియములను భోగభాగ్యములనే మాలిన్యములచే కప్పబడింది. ఈ మనస్సు రెండింటి చేత కప్పబడింది. అనగా రాగద్వేషములు భోగభాగ్యములు అనే యీ నాల్గింటి చేత కప్పబడింది. కనుకనే మానవుడు తనయొక్క స్వరూపాన్ని తాను తెలుసుకొనలేక పోతున్నాడు. ఈ భౌతికమైన లౌకికమైన భోగభాగ్యములు సుఖసంతోషములే తనయొక్క ఆధారములని తన స్వరూపములని విశ్వసిస్తున్నాడు. ఇవి కేవలము కదలిపోయే మేఘములు. ఇందులో ఒక్క మేఘము కూడను శాశ్వతముగా నిల్చేది కాదు. కానీ సుఖానందములు శాశ్వతమైనవి.

మానవుడు భుజించే ఆహారము వల్ల యీ రాగద్వేషములు భోగభాగ్యములు అభివృద్ధి అవుతున్నాయన్న సత్యాన్ని గుర్తించే ప్రాచీనులు దీనికి ఒక చక్కని రాజమార్గమును కనిపెట్టారు. భుజించుటకు పూర్వము కొన్ని ప్రోక్షణాల చేత ఆహారమును పరిశుద్ధముగావించుకొనే వారు. 'అన్నం బ్రహ్మ రసో విష్ణుః భోక్తా దేవో మహేశ్వరః' ఈ భుజించే అన్నము బ్రహ్మతో సమానము. రసము, essence అంటారు అనగా త్రాగేనీరు, భుజించే

పదార్థముల సారము విష్ణు స్వరూపమన్నారు. భోక్తా దేవో మహేశ్వరః. అనగా మేము భుజించే అన్నము శాశ్వతమైన ఆనందమును అందించాలి అని దేనితో ప్రోక్షింప బడుతున్నది ఋతం సత్యంతో ప్రోక్షింప బడుతున్నది. కనుక ఓ బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపులైన త్రికాల జ్ఞాన త్రిలోక స్వరూపులు అయిన మీరు ఋతం సత్యం యొక్క స్వభావాన్ని మాకు అందించండి. ఋతం అనేది మాలో అభివృద్ధి పరచాలి. అనగా త్రికరణ శుద్ధిగా వుంచాలి. సత్యం ఆచరణయందు అనవరతము వుంటుండాలి. ఈ విధమైన ఆహారమును ఋతముగా సత్యముగా మార్చుకొనే నిమిత్తమై ఆహారమును ప్రోక్షించి పవిత్రముగా వుంచి ప్రసాదముగా స్వీకరించేవారు.

కానీ యీనాటి మానవుడు మేధా శక్తినే ప్రధానముగా వుంచుకొని యీ ఋతం సత్యం అనే దానిని విస్మరించి మేధాశక్తికి మించిన శక్తి లేదు యీ జగత్తునందని విఱ్ఱవీగుతున్నారు. శంకరాచార్యుల వారు దిగ్విజయ యాత్ర చేసే సమయమందు మండన మిశ్రునితో వాదన ఏర్పడింది. ఈ వాదన మేధాశక్తి యొక్క ప్రమాణమును ప్రకటించే నిమిత్తము. అయితే వీరిద్దరి వాదనలలో జయాపజయములు నిర్ణయించు అధికారము ఒకరికి వుండాలి. కనుక శంకరాచార్యునకు మండన మిశ్రునకు మధ్యలో జయాపజయములు నిర్ణయించే వ్యక్తి ఎవరు అని విచారణ చేశారు. సర్వ విధముల యోచించి సత్యవాది, పవిత్రమైన హృదయము, దివ్యమైన భావము, ఋత సంపత్తు కలిగిన, శ్రద్ధ స్థిరత్వము కలిగిన ఉభయ భారతిని నిర్ణయము చేయుటకు జడ్జిగా నియమించారు. బుద్ధి అనగా కేవలము ఆసక్తి, స్థిరత్వము ఈ రెండింటిలో కూడిన ఋతము యీ ఉభయ భారతి యొక్క స్వభావము. ఈ ఉభయ భారతి ఎవరు? మండన మిశ్రుని భార్య. శంకరాచార్యునకు యీ మండన మిశ్రునకు వాదము జరుగుతున్నప్పుడు ఎవరైనా లోకములో తన భార్యనే జయాపజయములు నిర్ణయించమని అపోజిట్ పార్టీవారు కోరలేరా! ఒక వేళ నిర్ణయించుకుంటే తన భర్త వైపే విజయము సాధించాలని కోరుతుందిగానీ సమత్వములో, దివ్యత్వములో, పవిత్రతలో నిర్ణయించే వ్యక్తులు చాలా అరుదు. అనగా శంకరాచార్యుని స్వభావము ఏమిటి? మేధాశక్తి కంటె బుద్ధి యొక్క శక్తి చాలా ఉత్కృష్టమైనది; శక్తివంతమైనది అని భావించే ఆ ఉభయ భారతిని నిర్ణయము చేశాడు. కనుక మేధస్సుకంటె బుద్ధి చాలా శక్తివంతమైనదనే విషయాన్ని గుర్తించాలి విద్యార్థులు. సామాన్యముగా భావించే బుద్ధి కాదు యిది. ఆస్థ, స్వస్థ అనే ఆసక్తి, స్థిరత్వము కూడిన శాంతియే యీ బుద్ధి. ఋతము, సత్యము యీ రెండింటిలో ఏకీభవించిన శుద్ధమే యీ బుద్ధి. ఇంక యోగము మహత్తరమైన శక్తి. మహత్తత్వము యీ రెండింటిలో

కూడిన పవిత్రమే యీ బుద్ధి. బుద్ధి అనగా కేవలము ఆలోచనా శక్తి మాత్రమే కాదు. కేవలము విచా
రణా శక్తి మాత్రమే కాదు. కేవలము వివేక శక్తి మాత్రమే కాదు. కేవలము విజ్ఞాన శక్తి మాత్రమ
కాదు. విచక్షణా శక్తితో కూడిన విచారణ శక్తి. వీరి వాదనను పురస్కరించుకొని ఉభయ
భారతి మండన మిశ్రుని ఓటమికి అంగీకరించింది. అనగా తన భర్తనే ఓడిపోయినట్లుగా
అంగీకరించింది. ఇది సత్య ఋతములతో కూడిన నిర్ణయము. దీనికి శంకరులు చాలా ఆనం
దించాడు. ఇంతటితో పోక ఉభయ భారతి నిర్ణయాను సారము నీవు శంకరుల వారికి దాసుడు
కావాలి శిష్యుడు కావాలి సన్యాసము స్వీకరించమని ఆదేశించింది. మాట సత్యము. చెప్పినదాని
చేయటమే సత్యము. తలచిన దానిని చెప్పటము, చెప్పిన దానిని చేయటము ఋతము.
కనుక నీవు యీ నిర్ణయాను సారంగా యీ సన్యాసమును స్వీకరించమని ఆదేశించింది ఉభయ
భారతి. కాని గృహస్థ ధర్మమునందు ఇల్లాలు, ధర్మపత్ని, గృహలక్ష్మి అనే బిరుదులు అందుకు
న్నందుకు లోకములో స్త్రీ జాతికి ఆదర్శము నందించాలనే ఉద్దేశ్యముతో తన భర్త సన్యాసి అయి
నప్పుడు తాను కూడా సన్యాసి కావటము సహజమని భావించి ఆ ఉభయభారతి కూడను సన్యా
సము స్వీకరించింది. భర్తను అనుసరించటము భార్యల యొక్క సహజము. ఆమె నిజముగా
సన్యాసము స్వీకరించ నక్కరలేదు. కాని లోకాదర్శ నిమిత్తమై తాను సన్యాసము స్వీకరించింది.
పరిశుద్ధ హృదయురాలు ఉభయ భారతి. ఆమె ఒక ఆశ్రమము నిర్మించుకొని కేవలము
మేధాశక్తి చేత జయము సంపాయించాలనే అపేక్ష కలిగిన అహంకార వ్యక్తులకు సరియైన మా
ర్గము చూపించాలని తాను సంకల్పము చేసుకుంది.

తాను ఆశ్రమము నిర్మించుకొని ఆశ్రమము నుంచి నదిలో స్నానము చేసే నిమిత్త
మై తనను అనుసరించే కొంత మంది శిష్యురాండ్రతో ఆమె ఒక నాడు బయలు దేరింది.
మార్గ మధ్యము లోపల సర్వసంగ పరిత్యాగి యని ప్రసిద్ధి గాంచిన ఒక సన్యాసి నీరు త్రాగే ఒక
సొరకాయ బుఱ్ఱ ఎక్కడైనా బయట పెడితే ఎవరైనా దొంగిలిస్తారో యేమో అనే భయము
చేత, దానిపై వున్న అభిమానము చేత ఆ సొరకాయ తల క్రింద పెట్టుకొని పడుకున్నాడు
యీ సన్యాసి. అతనికి సరియైన ఉపదేశము చెయ్యాలని సంకల్పించుకుంది ఉభయభారతి.
అతను వినునట్లుగా తన శిష్యురాండ్రతో చెబుతున్నది: 'చూడవే! ఇతను సర్వసంగ పరిత్యాగి
కాని సొరకాయ మీద మాత్రం అభిమానము పోలేదు. ఈ చిన్న అల్పమైన దాని యందే యింత
అభిమానము వున్నప్పుడు ఘనమైన దాని యందు అభిమానము ఎంత గొప్పగా వుంటుందో.
ఇతని పేరుకు తగిన ప్రవర్తన కాదే!' విన్నాడు యీ సర్వసంగ పరిత్యాగి. మనసులో చాలా బాధ

ఉద్రేకము రెండూ చేరిపోయాయి. ఒకస్త్రీ నన్ను యింతటి మాట అనటమా. అతను ఒక విధమైన ద్వేషమును కూడను అభివృద్ధి పరచుకున్నాడు. తిరిగి లోను స్నానము చేసి వచ్చే లోపల యిదుగో చూడు అన్నట్లుగా తన తల క్రింద వున్న సొరకాయ బుర్రను తీసి ఆమె పాదాల వద్దకు విసిరాడు. అప్పుడు ఉభయ భారతి చెప్పింది. 'అయ్యో పాపం వట్టి అభిమానమే కాదే అహంకారము కూడా వుంటున్నాది' అనింది. 'ఈ అభిమాన అహంకారములు మానవునకు వుండినంత వరకు ఆత్మను అర్థము చేసుకోలేరు. ఆత్మానందము పొందలేరు' అనింది. ఈ సత్యాన్ని సర్వసంగపరిత్యాగి గ్రహించాడు. పరుగెత్తి వచ్చి ఆమె స్త్రీయా, పురుషుడా అనే విచక్షణా జ్ఞానము లేకుండా ఆమె పాదముల పైన పడ్డాడు. నా దోషములను క్షమించమన్నాడు. సహజంగా మానవులకు అన్ని విధములైన బంధనలకు మూలకారణము అభిమాన అహంకారములే. నేను అనే అహంకారము, నాది అనే మమకారము యీ రెండు పోయినప్పుడు నీవు నీవుగా నిలుస్తావు. ఈ విధమైన అహంకార మమకారములన్నియు ఆహారము చేతనే కూడుతాయి. దుష్టమైన లేక దురార్జితమైన ఆహారము మానవుని అనేక విధములుగా అజ్ఞానములో ముంచుతుంది. పవిత్రమైన భావాలను అణగద్రొక్కుతుంది. ఎక్కడ ఎప్పుడు ఏమి ఎవరితో ఎలా మాట్లాడాలి అనే విషయము కూడను మరచిపోతుంది.

కనుకనే మహాభారత యుద్ధమునందు భీష్ముడు మహాత్యాగి, మహాజ్ఞాని. అతని దీక్షను యిట్టిది అట్టిది అని ఎవరు వర్ణించ తీరు. పితృవాక్య పరిపాలనను శ్రీరామచంద్రుడు పదునాల్గు సంవత్సరముల వరకు మాత్రమే పరిపాలించాడు. కాని భీష్ముడు తండ్రి ఆజ్ఞను యావజ్జీవితము కూడను అనుసరించాడు. దృఢమైన సంకల్పము కలిగినవాడు కనుకనే యితనికి భీష్ముడని పేరు వచ్చింది. ఇటువంటి ప్రతిజ్ఞలకు భీష్మునికి మించినవారు మన భారతదేశమందు యే చరిత్రయందు కానరారు. అట్టి భీష్ముడు మహాభారత యుద్ధమందు తొమ్మిదవ దినమున నేలకూలాడు. శరతల్పము పైన పరుండినాడు. పాండవులు ద్రౌపదితో కూడి పితామహుడైన భీష్మాచార్యుని దర్శించే నిమిత్తమై వచ్చారు. శరతల్పము పైన పరుండిన భీష్ముడు ధర్మజునకు, భీమునకు, అర్జునునకు, నకులునకు, సహదేవునకు శాంతి పర్వమును బోధిస్తున్నాడు. ఏది ధర్మము యేది అధర్మము, ఏది న్యాయము ఏది అన్యాయము ఏది క్రమము ఏది అనాచారము, దేనిని మనము అనుభవించాలి. దేనిని మనము అనుసరించాలి అనే విషయము పాండవులకు చెప్పుతున్నాడు. ఈ విధముగా ప్రశాంతమైన వాతావరణమునందు పాండవులకు శాంతి పర్వము బోధించేటప్పుడు వినలేక ద్రౌపది ఫక్కున నవ్వింది.

పెద్దలైన, పితామహుడైన, జ్ఞానియైన యీ భీష్ముడు సందేశాన్ని యిచ్చే సమయము లోపల స్త్రీ
సామాన్యమైన స్త్రీ యీ విధముగా నవ్వటం అవమాన పరచినట్లుకాదా. వినయ విధేయతలు అం
దించవలసిన యీ స్త్రీ నవ్వింందని భీమునికి కోపం వచ్చింది. కండ్లను కదిలించాడు. అర్జు
నకు కన్నులు ఎర్రబడిపోయాయి. ధర్మజుడు తలవంచుకున్నాడు. నకుల సహదేవులు విచార
పడుతున్నారు. పాండవుల యొక్క గౌరవ ప్రతిష్ఠలంతా కూడను యీ విధమైన దీంటో అవమా
నము పాలౌతున్నదే అని కూడను ఒకరికొకరు విచారము చేస్తూ వచ్చారు. భీష్ముడు చక్కగా
గుర్తించి 'ధర్మజా! ద్రౌపది చాలా గొప్ప బుద్ధి కలిగినది. ఆమెకు మించిన పతివ్రత యీ
జగత్తులో లేదు. కానరాదు. మహా గుణవంతురాలు. ప్రపంచములో ఎవరికి లేని గుణములు
కూడా వుంటున్నవి. అదెలా. ఆమె కారణము లేని కార్యము చేయదు. కనుక యీ నవ్వుకాని
కి కారణము వున్నది. ఈ కారణమును యిప్పుడు నిరూపిస్తాను చూడమని చెప్పి 'అమ్మా!
ద్రౌపతి దగ్గరకు రా' అని పిలిచాడు. 'నీ నవ్వుకు కారణమేమిటో చక్కగా వివరించి నీ పతుల
కు అర్థమయ్యేటట్లుగా బోధించమన్నాడు.' 'పితామహా! యిది నా దోషమే. కాని అన్యాయ
అక్రమ అనాచారములతో అసత్యములతో ప్రవర్తించిన కౌరవులకు బోధించవలసిన
బోధలు సత్యధర్మ నిరతులైన పాండవులకు బోధించటములో అర్థమేమిటి? నీవు కౌరవు
లకు సైన్యాధిపతిగా వుండి కూడను నీవు కౌరవులకు బోధించవలసిన విషయాలను పాండ
వులకు బోధిస్తున్నావు. పాండవులు యేనాడు అధర్మము నాచరించలేదు. అక్రమములో
ప్రవేశించలేదు. వారు నిత్య సత్యవ్రతులు. ధర్మాచరణము యిలాంటి వారికి నీ బోధ కేవల
ము వృథా అయిపోతున్నదే అని నేను విచారించాను' అంది. 'నీ బోధలంతా దుష్టులకు, దుర్మా
ర్గులకు అత్యవసరము. అప్పుడు భీష్ముడు చెబుతున్నాడు. 'ద్రౌపతీ! నేను కౌరవుల వైపు వుండిన
వాడను. నా ఆహారమంతయు కౌరవులు పెట్టిన ఆహారమే. నేను వారి వుప్పు పులుసు తిన్నాను.
కనుక వారి అన్యాయ అక్రమ అనాచార అసత్యములతో కూడిన ఆహారము భుజించటము చేత
నా రక్తమంతా అన్యాయ అక్రమముగానే మారిపోయింది. నీ పతియైన అర్జునుడు వేసిన అంబు
లచేత ఆ యొక్క మాలిన్యమైన రక్తమంతా కారిపోయింది. దీనికి అట్టడుగున వున్న ధర్మములు
యిప్పుడు వస్తున్నాయి. ఇంతకాలము నా ధర్మములు, నా ప్రతిజ్ఞలు, నా న్యాయమును యీ చెడు
రక్తమే కప్పిపెట్టింది. కనుక యిప్పుడు ఆ మలినమైన రక్తమంతా పోయింది. అడుగున దాగి
వున్న న్యాయ ధర్మాలు యిప్పుడు వుప్పొంగి వస్తున్నాయి ద్రౌపతీ! అన్నాడు. కనుక ఆహారము
యొక్క ప్రభావము ఎంతగొప్పగా వుంటున్నదో విచారించండి. ద్రౌపతి నవ్వువలన యీ

సత్త్వము బయట పడింది.

పతుల మాటలకు యెదురు చెప్పంగ బోదు
వారి సేవలు చేయగా తీరదలదు
తనకు నున్నట్టి దానిచే తృప్తిగనును
ద్రౌపతికి సాటి యే పతివ్రతయూ లేదు

ఒక్కరు కాదు ఐదు మంది పతులు. ఒక పతి ఆజ్ఞను నడచుకోటమే కష్టము యీ కాలములో. ఐదు మంది పతుల ఆజ్ఞను శిరసావహించి కాదు లేదు అనే జవాబు లేకుండా నడచుకుంటూ వచ్చింది. ఇక్కడ ద్రౌపతి యొక్క పతులు ఎవరు? ధర్మ అర్జున భీమ నకుల సహదేవులు కాదు. పంచ ప్రాణములే ద్రౌపతి పతులు. ప్రతి మానవునియందు యీ ఐదు పతులు వున్నాయి. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన యీ ఐదింటిని సమముగా సమన్వయపరచుకొని వచ్చింది. ప్రతి మానవుడు స్త్రీ, పురుషులు కూడా యీ ఐదు ప్రాణములను మనము కలిగే వుంటున్నాము. మనము వీటిని అనుసరిస్తున్నామా? ఒక్కొక్క సమయములో ఒక్కొక్కటి వుద్రేకిస్తుంది. 'తనకున్న దానిచే తృప్తి పడుచునుండు' ఈ నాటి వేళ ఐదు వందల రూపాయలు నెలకు జీతము వస్తుంటే వేయి రూపాయల కంచె చీర కావాలని చెప్పటం లేదు ఆ అవ్వ. ఐదు వందల రూపాయలు వస్తుంటే దానికి తగినట్టుగానే నడచుకొనే స్త్రీ. అనగా మనకున్నదానితోనే మనము తృప్తి పడాలి. కనుక ద్రౌపతి నిరంతరము తృప్తిగానే వుండేది. కారణము ఏమిటి? అసంతృప్తికి కారణము వున్నదానిని త్యజించి లేని దానికై ఆరాటపడుతున్నారు. అందుకనే అశాంతికి గురై పోతున్నారు. ద్రౌపతి లేని దానిని ఆశించటం లేదు. ఉన్నదానిని వదలటం లేదు. వున్న దానినే అనుభవిస్తున్నాది.

కనుక యీ కారణమును పురస్కరించుకొని ఆహారము చే బుద్ధులు వివిధముగా మారుతున్నాయి అనేది విద్యార్థులు చక్కగా గుర్తించుకోవాలి. మన రాగద్వేషములు గాని అభిమాన మమకారాదులు గాని ఆహారము చేతనే సంభవిస్తున్నాయి. కనుక యీ ఆహార నియమమనేది మనో బుద్ధులకు అత్యవసరమైనది. మనస్సు యొక్క తత్త్వము చాలా విచిత్రమైనది. శాస్త్రములన్నియు దీనిని యే విధముగా వర్ణించాయంటే మానవుడు ఇంద్రియముల ననుసరించటము చేత పశువై పోతున్నాడు. మానవుడు మనసును అనుసరించటం చేత మనిషి అవుతున్నాడు. మానవుడు బుద్ధిని అనుసరించటము చేత మహత్త్వము కలిగిన వాడౌతున్నాడు. మహనీయుడౌతున్నాడు. మానవుడు ఆత్మను

అనుసరించిన నాడు 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. లానే బ్రహ్మగా మారుతున్నాడు. మనము ఇంద్రియములను అనుసరించటం చేతనే పశువుగా మారుతున్నాము. మనసునైనా అనుసరించి మానవునిగా నిలు. బుద్ధిననుసరించి మహానీయుడు కాకపోయినప్పటికిని మనసుననుసరించి మానవునిగానైనా జీవించు. ఐతే చాలా మంది ఒకడు సందేహించవచ్చు. మనసు కూడా చాలా చెడ్డదే కదా అని. మనసు ఎప్పుడూ పరిశుద్ధమైనదే. ఇటువైపు ఇంద్రియములను అనుసరించటం చేత మాలిన్యమును పొందుతున్నది. ఇంద్రియములు సేకరించిన విషయ సామగ్రిని మనస్సు సేకరిస్తుంది. మనసు యేమాత్రము విషయాన్ని స్వీకరించలేదు. మనసు ఇంద్రియానికి master. ఈ మనసు followers అయిన ఇంద్రియములు అనేకమైన విషయాలు సేకరించి మనసుకు ఇవ్వటం చేత మనస్సు చక్కగా కూర్చుని భోజనము చేస్తున్నాది. ఐతే యీ మనస్సు బుద్ధిని కూడను కొంచెం అనుసరించిందంటె ఆ బుద్ధి వచ్చి చెబుతుంది మనసుకు ఇది చేయతగినది ఇది చేయతగనిది. ఇది ఒప్పుకోకూడదు ఇది ఒప్పుకోవచ్చు అని నిర్ణయిస్తుంది. కాని బుద్ధిని యేమాత్రము సంప్రదించటము లేదు మనసు. ఇంద్రియములిచ్చిన దానినే యీ మనస్సు అనుభవించటం చేత మాలిన్యము పొందుతున్నాది.

మనము యీ గడచిన దినములంటా కూడను శరీర ఇంద్రియ మనో బుద్ధులు నాల్గింటిని గురించి తెలుసుకున్నాము. ఈ నాల్గింటి యొక్క ఏకత్వస్వరూపమే క్షేత్రము అన్నారు. ఈ క్షేత్రము కేవలము జడమైనది. మనసు జడమైనదే. ఇంద్రియములు జడమైనవే. దేహము జడమైనదే. ఐతే యీ జడమైన దానిని గురించి యీనాడు తెలుసుకున్నాము ఈ జడమైన వాటి స్వభావము యేరీతిగా control చేసేది? అదే క్షేత్రజ్ఞుడు. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞులకు మధ్య కొంత అవకాశము వుంటుండాది సృష్టి యొక్క పరిణామము. ఈ క్షేత్రము మరికొన్ని మాలిన్యమైన దానితో పరిశుద్ధమైన దానితో కూడను స్నేహము కలిగి వుంటుంది. అవియే త్రిగుణములు. సత్వరజోతమో గుణములు. ఈ సత్వరజోతమో గుణములు చాలా విచిత్రమైనవి. చాలా ఆశ్చర్యముగా వుంటుండేవి. ఇవి ఏ విధముగా సృష్టింపబడినవి యీ సృష్టికి త్రిగుణములు యే విధముగా ఆధారము? ఈ జగత్తు త్రిగుణాత్మక రూపమైన జగత్తు అనటానికి ఏమి కారణము అనే విషయాన్ని రేపటి దినము మనము తెలుసుకుందాము. నిజముగా త్రిగుణముల యొక్క సృష్టి యిప్పుడు కూడను మీరు విని వుండరనుకుంటాను. అలాంటి విషయము రేపు చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి.